# ఆడకత్తెర

శ్రీ న. రా. శివస్వామి

రామారావు:-అమ్మా వంటయిందా ?

నరసమ్మ:-అయిందిరా నాయనా. ఇవాళ కొంచెం లేటయిపోయింది.

రా:-(కామశాస్త్రితో)-అన్నయ్యా, అమ్మ కూడా ఇంగ్లీషు నేర్చేస్తునాది !

కామశాస్త్రి:-నేను ప్రైవేటు స్టూడెంట్లకి చెప్తూంటే ఒకటి రెండు మాటలు అమ్మచెవిని పడుతుంటాయి.

రా:-అవి మళ్ళీ రెండో చెవిలోంచి వెళ్ళిపోకుండా వుంటాయన్నమాట.

న:-ఊరుకోండురా, మీరూ మీ వేళాకోళాలున్నూ కాటికికాళ్లు చాచుకొని నాకింగ్లీషు తక్కువయింది !

కా:-(భోజనానికి వెళ్తూ) - పదరా భోజనానికి - ఇంకా మడికట్టుకోలేదేమిటి ?

రా:-ఇదే యుద్ధంబునకు సిద్ధంబగుచుంటి.

కా:-ఒక్కలాగుందమ్మా వాడిచిన్నతనం.

◆ ◆ ◆

కా: (భోజనంచేస్తూ) - అంతకూరా మాకే వేస్తున్నావేంటమ్మా !

న:-నా కెందుకురా నేనే ఆవకాయో ఏదో వేసుకొని తింటాను.

రా:-(వెటకారంగా) - ఈ ఆడవాళ్లందరూ ఇంతేనన్నయ్యా. వేడికూరలూ పచ్చళ్లూ వాళ్ల కక్కర్లేదు. ఏ ఊరగాయతోనో ఇన్ని మెతుకులు తినడం తప్ప.

న:-అవున్రా బాబూ, మేముకూడా మీలాగ 'ఇదిలేదు అదిలేదు' అని తిండిమానేస్తే మీపనేమిటయ్యేదో. దానిమాటకేంగాని, పెద్దవాడా! తమ్ముడికి జీతండబ్బు ఇవ్వాలిట ఎంతో అడిగేవా !

(కామశాస్త్రి మొహం వివర్ణమవుతుంది. మరెవ్వరూ మాట్లాడకుండా భోజనాలు ముగిస్తారు.)

◆ ◆ ◆

కా:-ఎంతకావాలి ?

రా:-డెబ్భయి రూపాయలు టెర్మ్‌ఫీజు కట్టాలి.

కా:-నూరు రూపాయలొద్దూ ?

రా:......

కా:-(మనీపర్సుతీసి) - ఊఁ ఇంద, లెక్కపెట్టు. ఒకపది కాదు, రెండుపదులు కాదు ఏడూ.

రా:-(లెక్కపెట్టి ఇంకా నిల్చుంటాడు.)

కా:-ఏమిటింకా ?

రా:-అది కాదన్నయ్యా - మరేమో.

న:-(ఇంట్లోంచి వస్తూ) - బాబూ వాడికి బట్టలు లేవట్రా. కాలేజీకి వెళ్లడానికొక రెండు జతలేనా కుట్టించాలి. వషం రెండేళ్లయింది వాడికి కొత్త బట్టలు కొనేలేదు.

కా:-ఫీజు, బట్టలు, డబ్బు డబ్బు - ఎక్కడినించొస్తుంది? నేనెలాగ మేష్టరునయ్యాండికూడా, ఈ చింకి బట్టలతోనే పాతగుడ్డలతోనే కాలక్షేపం చేస్తున్నాను?

రా:-మరెలాగన్నయ్యా. నలుగురులో అసహ్యంగా ఎలాగ తిరగమన్నావు? మనూళ్లో అయితే పరవాలేదుగానీ.

కా:-చాలుతే కట్టిపెట్టు. చెమటోడ్చి నెల కెనభై రాళ్లు సంపాదిస్తున్నాను. బట్టలకీ, జీతాలకీ నువ్వూ, వంటకీ పెంటకీ ఇంట్లోవాళ్లూ ఉన్నదంతా ఊడ్చేస్తున్నారు. ఎక్కడినుండి తెచ్చేది!

న:-అలాగంటే ఎలాగరా బాబూ? (రామారావు వేపు తిరిగి) పిల్లడు చిన్నబుచ్చుకుంటాడు. ఏదోలాగ సరిపెట్టుకోవాలిగానీ.

కా:-అవునమ్మా. (పెడమొహం పెట్టి) అంతా నువ్వే వాడికి మప్పేవు, (కోపంగా) అందరూ నన్ను దోచేస్తున్నారు. ఊఁ, పట్టుకుపొండి (మనీ పర్సులోంచి ఇరవై రూపాయలు టేబిలుమీద పడేస్తాడు) అఘోరించు.

న:-(ఇంట్లోకి వెళ్ళిపోతూ) ఇవ్వవలసిందెలాగూ ఇస్తాడు. ఎందుకో ఆ విసుగు.

♦ ♦ ♦

రా:-సాయంత్రం రైలుకి వెళ్ళిపోతానన్నయ్యా.

కా: ఊఁ హూఁ, సరే.

రా:-(సంకోచిస్తూ)-మాకు పరీక్షలు దగ్గరకొస్తున్నాయి.

కా:-అదే నేనూ చెప్దామనుకుంటున్నాను. తిరుగుళ్లు తగ్గించి కొంచెం చదువుమీద శ్రద్ధుంచు. జీతాలు కట్టడం, డ్రెస్సులు కుట్టించడమే కనిపిస్తోంది గాని.

రా:-మరీ, పరీక్షలముందు పుస్తకాలెవరూ ఇవ్వరన్నయ్యా.

కా:-ఆ వెంకట్రావు దగ్గరకెళ్లి చదువుకో. ఏదో మెల్లిగా సర్దుకొని సంపాదించుకోవాలిగాని, ఎలాగ!

రా:-రెండు మూడు 'ఇంపోర్టెంట్ టెక్స్టు బుక్స్'న్నా కొనాలన్నయ్యా. ఎంతకని వీళ్లనీ వాళ్లనీ అడగడం. ఒక పాతిక రూపాయలిస్తే.

కా:-(కళ్లెర్ర చేస్తాడు. నోటంట మాటలు రాక రాక వస్తాయి) - మళ్లా డబ్బు!

నోరు మూసుకొని అవతలకిపో! నన్ను మరేమీ అడక్కు.

(రామం ఇంట్లోకి పోతాడు)

రా:-అమ్మా, నేను వద్దంటూవుంటే కాలేజీలో జాయిన్ చేశారు. పుస్తకాలకి డబ్బడిగినా, జీతానికనడిగినా కర్రుబుస్సుమంటూంటే నేను భరించలేను.

న:-వాడు కోపంమీదేదో అంటే ఎందుకురా నీ కంత పౌరుషం?

రా:-అవునమ్మా, నువ్వుకూడా నన్నే అంటావు. అందరూ ఒక్కలాంటి వాళ్లేచేరేరు (కాలు నేలపై కొడతాడు) నేను మరి కాలేజీలో చదవలేను. తిట్లుపడలేను. నిన్న నిచ్చిన డబ్బుకూడా తీసుకో నాకక్కర్లేదు (జేబులోని నోట్లు నేలపైపడేసి, వెనుతిరిగి చరచరపోతాడు.)

న:-(విస్తుపోయి) - ఒరేయ్, రామం!

(కొన్ని క్షణాలు గడుస్తాయి)

కా:-(గబగబా ఇంట్లోకివస్తూ) - అమ్మా, నువ్వే వాడికంతా నేర్పుతున్నావు.

న:-ఏమిట్రా నాయనా.

కా:-ఏమిట్రా అని ఇంకా అగుడుతున్నావు! నా దగ్గరేమీ 'డబ్బు చెట్టు' లేదు, దులపడానికి. ఎక్కడినుంచి పట్టుకొచ్చేది, బట్టలకీ, పుస్తకాలకీ వాడికి? ఇంట్లోకేమిటికొనేది?

న:-చిన్నవాడితో నీకేమిటి బాబూ! లేరా ప్రవేశపెట్టక డబ్బులేదంటే యెలా?

కా:-అవునమ్మా, కాని నేనేమీ మరి సంపాదించలేను. నే నీ సంసారం చెయ్యలేను. నువ్వే చూసుకో. ఈ వున్న 'ధనరాశి' ఏదో నువ్వే ఖర్చుపెట్టుకో (మనీపర్సు క్రింద పడేస్తాడు.) అందరూ ఒక్కలాటివాళ్లేచేరేరు (వేగంగా వెనక్కి పోతాడు.)

